క్లుప్తంగా

ఉపాధి కూలీలకు చీరల పంపిణీ



కూలీలకు చీరలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక: ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవరుచుకోవాలని కూటమి నేతలు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్ కోరారు. మండలంలోని వాడ్రాపల్లికి చెందిన కొయిలాడ దశావతారం వివాహ వార్షికోత్సవంలో భాగంగా సమకూర్చిన 250 చీరలను శనివారం వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పనిచేసిన కాలానికి సకాలంలో వేతనం అందుతుందన్నారు. దశావతారం సేవలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవీ సత్యనారాయణ, ఆడారి శ్రీకాంత్, నూకప్పారావు, శేషు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక



కోటవురట్లలో యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

కోటవురట్ల: సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్–2047 యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ గ్రామ సచివాలయాల జాబితా ఆధారంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి వారి ఆసక్తిని అనుసరించి పథకాలను అందించాలని సూచించారు. డ్వాక్రా సంఘాల అభివృద్ధి, వ్యవసాయం, ఉద్యానవన పంటల రైతులకు ప్రోత్సాహం అందించాలన్నారు. అన్ని రంగాలలో ప్రోత్సహించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. మునగపాక బైపాస్ రోడ్డులో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. కుట్టుశిక్షణలో మెరుగైన ప్రతిభ చూపి ఆదాయం పెంచుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారితకు ఎంతో కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ, ఆడారి శ్రీకాంత్, ఆడారి గణేష్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై కొరవడిన పర్యవేక్షణ



అధికారుల పర్యవేక్షణ లేకుండా సీసీ రోడ్డు నిర్మాణం

ఎస్.రాయవరం: అడ్డురోడ్డు–నర్సీపట్నం రోడ్డు నిర్మాణ పనుల వద్ద అధికారులు పర్యవేక్షణ కొరవడింది. కొన్నేళ్లుగా గతుకులమయంగా మారిన రోడ్డుకు ఇటీవల నిర్మాణ పనులు చేపట్టారు. నత్తనడకన నడుస్తున్న ఈ పనుల్లో దార్లపూడి జంక్షన్ సమీపంలో సీసీరోడ్డు వేస్తున్నారు. ఇక్కడ ఆర్‌అండ్‌బీ అధికారులు పర్యవేక్షణ లేకుండా పోయింది. అసలు రోడ్డు వేసిన తర్వాత నీటి తడుపు సక్రమంగా ఉండటం లేదని స్థానికులు వాపోతున్నారు. తడపడానికి ఎండు వరిగడ్డి వేయగా, అది వెంటనే చివికిపోయింది. దాంతో నీరు తడిపిన కొంత సమయానికే రోడ్డు ఆరిపోతోంది. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షణతో సక్రమంగా చేయించాలని పలువురు కోరుతున్నారు.

రేపు వయోవృద్ధుల సమావేశం

అనకాపల్లి టౌన్: స్థానిక గవరపాలెం వి.వి. రమణ రైతుభారతి కేంద్రంలో ఈ నెల 5న జిల్లా వయోవృద్ధుల సంక్షేమ సంఘం సమావేశం జరుగుతుందని సంఘం వ్యవస్థాపకుడు కె.అప్పారావు తెలిపారు. వృద్ధుల ఆరోగ్య సమస్యలపై చర్చించి, అవసరమైన వారికి ఆయుర్వేద మందులు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఇసుక మాటున.. కాసుల వేట



ఇసుకను అక్రమంగా ట్రాక్టర్లను ద్వారా తరలిస్తున్న దృశ్యం



సముద్ర తీరంలో ఇసుకను అక్రమంగా తవ్విన దృశ్యం

- పొలాల్లో ఇష్టారాజ్యంగా తవ్వకాలు
- గోదావరి ఇసుకలో కలిపి విక్రయం
- చోద్యం చూస్తున్న అధికారులు

పాయకరావుపేట: ఉచిత ఇసుక పేరుతో నిబంధనలకు విరుద్ధంగా మండలంలో ఎక్కడబడితే ఇసుకాసురులు రెచ్చిపోతున్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఇసుక అక్రమ తవ్వకాలు చేపట్టి కాసులు కళ్ల చూస్తున్నారు. కళ్లెదుటే అక్రమ ఇసుక రవాణా సాగిపోతున్నా అధికారులు పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. మండలంలో ఇసుక తవ్వకాలకు ఏ విధమైన ప్రభుత్వ అనుమతులు లేనప్పటికీ యథేచ్ఛగా చేపడుతున్నారు. ప్రధానంగా పాల్మన్‌పేట, వెంకటనగరం, రాజానగరం, కుమారపురం, తదితర గ్రామాల పరిధిలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. సముద్ర తీర ప్రాంతమైన పాల్మన్‌పేట, వెంకటనగరం, కుమారపురం తదితర గ్రామాల పరిధిలో జీడిమామాడి తోటల్లోను, పొలాల్లోను, మకాల వద్ద పెద్ద ఎత్తున ఇసుక తవ్వకాలు అక్రమంగా చేపడుతున్నారు. అదేవిధంగా పెదరాంభద్రపురం, కేశవరం, సత్యవరం తదితర గ్రామాల పరిధిలో జీరాయతీ భూముల్లోను ఇసుకను ఏ విధమైన అనుమతి లేకుండా అక్రమార్కులు తరలిస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను తరలించరాదన్న నిబంధనలు ఉన్నప్పటికీ అక్రమార్కులు బేఖాతరు చేస్తున్నారు. యథేచ్ఛగా ఇక్కడ నుంచి ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ట్రాక్టర్లు, టిప్పర్లు ద్వారా ఇక్కడ నుంచి ఇతర మండలాలకు తరలిస్తున్నారు. ట్రాక్టరు ఇసుక రూ.4 వేలు నుంచి రూ.5 వేలు వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ, పోలీసు శాఖ అధికారులు ఇసుక అక్రమ తవ్వకాలపై స్పందించి నిలుపుదల చేయాలని పలువురు కోరుతున్నారు.

సముద్రపు ఇసుకతో భవనాలకు ముప్పు

పొలాల్లో, సముద్ర తీరంలో తవ్విన నాసిరకం ఇసుకను గోదావరి నుంచి తీసుకొచ్చిన ఇసుకలో కలిపేసి అమ్మేస్తున్నారు. ఈ విధంగా నాసిరకమైన ఇసుక వాడటం వల్ల భవన నిర్మాణాలు, ఇతర కట్టడాలకు ముప్పు ఏర్పడనుంది. ఇవి త్వరగా కూలిపోయే ప్రమాదముందని ఆందోళన వ్యక్తమవుతోంది. మరోవైపు ఇసుక తవ్వకాలు చేయడం వల్ల మత్స్యకార గ్రామాలు ముంపునకు గురవుతాయని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నత అధికారులు, ప్రజా నాయకులు అక్రమ ఇసుక దందాను అడ్డుకోవాలని పలువురు కోరుతున్నారు. తద్వారా రైతుల భూములకు నష్టం కలగకుండా రక్షణ కల్పించాలని విన్నవిస్తున్నారు.

వార్డుల్లో రోజూ చెత్త సేకరణ

మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు



స్థానికులకు పారిశుధ్య నిర్వహణపై సూచనలిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు



ర్యాలీ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

యలమంచిలి రూరల్: వార్డుల్లో పారిశుధ్య సిబ్బంది రోజూ ఇంటింటికీ వచ్చి తడి చెత్త సేకరిస్తారని, ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు కోరారు. స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని నెహ్రూనగర్ సచివాలయ పరిధి రామ్మూర్తినగర్, ద్వారకానగర్, చర్చి ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది పత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టారు. ఇక్కడ వీధుల్లో తిరిగి తడి, పొడి చెత్తను సేకరించే విధానాన్ని స్థానికులకు అధికారులు వివరించారు. తడి చెత్తను రోజూ, పొడి చెత్తను బుధ, శనివారాల్లో సేకరిస్తామని తెలిపారు. చెత్తను వీధుల్లో గానీ, మురుగు కాలువల్లో గానీ పారవేయవద్దని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో ప్రజల సహకారం, భాగస్వామ్యం ఎంతో అవసరమని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. అంతకుముందు వీధుల్లో చెత్తను తొలగించే కార్యక్రమం చేపట్టారు. మున్సిపల్ మేనేజర్ విజయ్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, పురపాలక సంఘం పరిధిలో ఉన్న సచివాలయాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక చట్టాల ఉల్లంఘన చట్టరీత్యా నేరం



జీడిపిక్కల పరిశ్రమలో కార్మికులతో మాట్లాడుతున్న న్యాయవాది నూకరాజు

ఎస్.రాయవరం: వ్యాపారులు కార్మిక చట్టానికి లోబడి నడుచుకోవాలని యలమంచిలి కోర్టు ప్యానల్ న్యాయవాది తుమ్మపాల నూకరాజు తెలిపారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో అడ్డురోడ్డు జీడిపిక్కల పరిశ్రమ, రెండు దాబాలను సందర్శించి కార్మిక చట్టాలపై అవగాహన కల్పించారు. అక్కడ పని చేస్తున్న వారికి సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. సుప్రీం కోర్టు ఆదేశాలు మేరకు మండల లీగల్ సర్వీస్ కమిటీ వారు కార్మికులు పనిచేసే వాణిజ్య సముదాయాలను సందర్శించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్మికులకు సదుపాయాల కల్పన, వెట్టి చాకిరీ వంటి పనులు వ్యాపార నిర్వాహకులపై న్యాయపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎన్‌జీవో ప్రతినిధి మణికుమార్‌బాబు, తిమ్మాపురం వీఆర్వో గోపి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం



అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన ప్రసాద్‌ను సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

- రేపు అనకాపల్లిలో వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ నెల 5న అనకాపల్లి విజయ రెసిడెన్సీలో జరగనున్న జిల్లా విస్తృత స్థాయి సమావేశం విజయవంతం కోరుతూ శనివారం మునగపాక పార్టీ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించారన్నారు. అప్పట్లో ప్రవేశ పెట్టిన పథకాలు నేటికీ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఇప్పటికే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికల్లో 26 పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు పోటీ చేసేలా ఇప్పటి నుంచే సిద్ధంగా ఉండాలన్నారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజా సమస్యలపై పరిష్కారానికి పార్టీ నేతలంతా ఐక్యంగా పోరాటం చేయాల్సి ఉందన్నారు. ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా పార్టీ అండగా ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ నేతలు మళ్ల సంజీవరావు, షేక్ ఇస్మాయిల్, నరాలశెట్టి సూర్యనారాయణ, కాండ్రేగుల నూకరాజు, సుందరపు తాతాజీ, దిమ్మల అప్పారావు, భీశెట్టి గంగప్పలనాయుడు, ఆడారి కాశీబాబు, మొల్లేటి నారాయణరావు, దాసరి అప్పారావు, మద్దాల వీరునాయుడు, శీరా రమణమ్మ, సూరిశెట్టి రాము, కాండ్రేగుల జగన్, పెంటకోట అప్పలనాయుడు, కాండ్రేగుల కిరణ్‌కుమార్, చదరం నాయుడు, గుంట్ల అప్పారావు, కోరుకొండ రాజు, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్డేడకు ఘన సత్కారం...

వైఎస్సార్‌సీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన బొడ్డేడ ప్రసాద్‌ను శనివారం పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కాండ్రేగుల నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు. బొడ్డేడకు పదవి దక్కడం పట్ల వారంతా హర్షం వ్యక్తం చేశారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఆగ్రహం

- నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో సేవలు అధ్వానం
- సర్వసభ్య సమావేశంలో సభ్యుల నిలదీత



ట్రాన్స్‌కో అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ మధు



ఏరియా ఆస్పత్రిలో సేవలపై ఫిర్యాదు చేస్తున్న ఎంపీటీసీ రాజు

నక్కపల్లి: ఇటీవల కాలంలో కొంతమంది అధికార పార్టీ నాయకులు ప్రొటోకాల్ పాటించకుండా ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడంపై మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైస్ ఎంపీపీ వీసం నానాజీ అధ్యక్షతన శనివారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశం జరిగింది. టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు మధు మాట్లాడుతూ కొద్ది రోజుల క్రితం వేంపాడు సబ్ స్టేషన్‌లో రెండు కోట్లతో ఏర్పాటు చేసిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ని కొంతమంది టీడీపీ నాయకులు ప్రారంభించారన్నారు. స్థానిక ఎంపీటీసీగా తనను ఆహ్వానించలేదన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా ఎవరు పడితే వాళ్లు ప్రారంభోత్సవం చేస్తే తామెందుకని నిలాదీశారు. టీడీపీ నాయకులకు సొంత పార్టీ నుంచే వ్యతిరేకత వ్యక్తమైంది. దీనికి అధికారులు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. పాయకరావుపేట ఏడీఈ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఆ రోజు ప్రారంభోత్సవంతో అధికారులకు సంబంధం లేదన్నారు. ఎవరు పడితే వాళ్లు వచ్చి కొబ్బరికాయ కొట్టేసినంత మాత్రాన అది ప్రారంభోత్సవం కాదన్నారు. ఇక్కడ ఏఈ సెలవులో ఉండటంతో తమపై పని భారం ఉందన్నారు. వేంపాడు సబ్ స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ని కొంతమంది టీడీపీ నాయకులు మంత్రి అనిత ఆదేశాలు మేరకు ప్రారంభించినట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయని, ఇది వాస్తవమా కాదా అని వైస్ ఎంపీపీ నానాజీ ట్రాన్స్‌కో అధికారులని ప్రశ్నించారు. ఏడీఈ మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ ఇంకా ప్రారంభం కాలేదన్నారు. ఉద్దండిపురం ఎంపీటీసీ బచ్చలరాజు మాట్లాడుతూ నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో సేవలు అధ్వానంగా ఉన్నాయని, రాత్రిపూట రోగులకు తీసుకెళ్తే పట్టించుకోవడం లేదన్నారు. డాక్టర్స్ బదులు సిబ్బందే వైద్యం చేస్తున్నారన్నారు. ఎక్సరేలు తీయడం లేదన్నారు. కాగిత ఎంపీటీసీ ఆకేటి గోవిందరావు మాట్లాడుతూ సారా, మద్యం తరలిస్తూ పట్టుబడిన మోటారు సైకిళ్లను సీజ్ చేయడం లేదన్నారు. బాటిళ్లు స్వాధీనం చేసుకుని వాహనాలు వదిలేయడం సమంజసం కాదన్నారు. దోసలపాడు ఎంపీటీసీ పక్కుర్తి రమణ మాట్లాడుతూ గ్రామాల్లో బెల్ట్ షాపులు ఎక్కువవుతున్నాయన్నారు. ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యా వ్యవస్థ పనితీరు అధ్వానంగా ఉందని డీఏపురం ఎంపీటీసీ కనకరావు తెలిపారు. పదో తరగతిలో ఎక్కువ మార్కులు వచ్చిన వారిని అభినందనలు తెలియజేయలేదన్నారు. వారిని ఇంటర్‌లో చేర్చుకునే ప్రయత్నం చేయకపోవడంతో ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు అభినందించి చేర్చుకుంటున్నాయన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, తహసీల్దార్ నర్సింహామూర్తి, ఎంపీడీవో సీతారామరాజు, ప్రత్యేక అధికారి ప్రసాద్, వైస్ ఎంపీపీ వెలగ ఈశ్వరరావు పాల్గొన్నారు.

నేడు దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



పీఎన్ఆర్ పేటలో కొలువుదీరిన దుర్గమ్మ

యలమంచిలి రూరల్: మండలంలోని పద్మనాభరాజు పేట గ్రామంలో కొలువుదీరిన దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాలను పీఎన్ఆర్ పేట, బయ్యవరం గ్రామాల్లో ఊరేగించనున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ అన్నసమారాధాన, నృత్య ప్రదర్శనలు ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు. వర్షం అడ్డంకి కలిగించకపోతే ఆదివారం సాయంత్రం గ్రామ శివార్లలో జిల్లాస్థాయి గుర్రపు పందేలు నిర్వహించనున్నారు. ఉత్సవాన్ని పురస్కరించుకుని ఇప్పటికే గ్రామానికి బంధుమిత్రులు భారీ సంఖ్యలో చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.

విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చు



విద్యార్థినులను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్

మునగపాక: విద్యతోనే పేదరికాన్ని జయించవచ్చని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. పదిలో మెరుగైన ఫలితాలు సాధించిన విద్యార్థినులు ఆడారి లక్ష్మీ గణేష్, బుదిరెడ్డి రేణుక, టెక్కలి భాగ్యశ్రీలను శనివారం సాయంత్రం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శాలువాలతో సత్కరించి నగదు బహుమతి అందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉంటారని, తద్వారా మంచి శిక్షణ అందుతుందన్నారు. పది తర్వాత లక్ష్యాన్ని సాధించేందుకు ఇష్టపడి, కష్టపడి చదువుకోవాలన్నారు. ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను గౌరవించాలన్నారు. ఏకాగ్రతతో చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. హెచ్ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ఆడారి సూర్యచంద్రరావు, పెద్దలు దాసరి అప్పారావు, ఆడారి లక్ష్మణరావు, ఆడారి కాశీబాబు, ఆడారి రమణబాబు, నాగేశ్వరరావు, భీశెట్టి శ్రీరామ్, పిన్నమరాజు రవీంద్రరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ

మునగపాక: అనకాపల్లిలో ఈ నెల 5న జరగనున్న వైఎస్సార్‌సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ కోరారు. శనివారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు జిల్లా పార్టీ అధ్యక్షునిగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవకాశం కల్పించిన నేపథ్యంలో నిర్వహించనున్న సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో పార్టీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు పిల్లి అప్పారావు, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు బొడ్డేడ లిల్లి, మందా రాము, బొడ్డేడ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో ఏకాగ్రత



కోటవురట్ల శాఖా గ్రంథాలయంలో కథ చెబుతున్న విద్యార్థిని



యలమంచిలిలో పుస్తక పఠనం ప్రయోజనాలు వివరిస్తున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు



విద్యార్థులకు గణితం నేర్పుతున్న విశ్రాంత ఉపాధ్యాయులు



అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

యలమంచిలి రూరల్: పుస్తక పఠనంతో విద్యార్థులకు ఏకాగ్రత పెరుగుతుందని తద్వారా చదువు, పోటీ పరీక్షల్లో రాణించవచ్చని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు సోమయాజులు సన్యాసిబాబు, వై అప్పారావు వివరించారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం విద్యార్థులు, పిల్లలకు పుస్తక పఠనం, నీతి కథలు, జనరల్ నాలెడ్జ్‌లపై అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా పుస్తక పఠనం చేపడితే కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి వి ఆనంద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం

పాయకరావుపేట: విద్యార్థులకు పుస్తక పఠనం ఎంతో అవసరమని విశ్రాంత ఉపాధ్యాయుడు టి.వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. భగవద్గీత శ్లోకాలు చదవడం, పుస్తక పఠనం చేయడం అలవర్చుకోవాలన్నారు. గణితం పట్ల అవగాహన కల్పించారు. గ్రంథపాలకుడు వామాల లక్ష్మణరావు, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీవీలు,ఫోన్‌లకు దూరంగా ఉండాలి

అచ్యుతాపురం: విద్యార్థులు టీవీలకు, ఫోన్‌లకు అతుక్కుపోకుండా వేసవిలో చదువుని అభ్యసించాలని రిసోర్స్ పర్సన్ సింహాద్రి నాయుడు తెలిపారు.అచ్యుతాపురం శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా శనివారం రిసోర్స్ పర్సన్‌గా విచ్చేసిన నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు తప్పకుండా పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని సూచించారు. గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు విద్యార్థులకు బిస్కెట్లు అందజేశారు.

పుస్తకాలు చదవాలి..

కోటవురట్ల: పుస్తకాలు చదవడాన్ని మంచి అలవాటుగా చేసుకోవాలని గ్రంథాలయాధికారి అప్పలనాయుడు కోరారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినులతో పుస్తక పఠనం చేయించి కథలు చెప్పడంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాన్ని సందర్శించడం ద్వారా వ్యక్తిత్వ వికాసంతో పాటు మంచి అలవాట్లు సాధ్యపడతాయన్నారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి పుస్తకాలకు దగ్గర కావాలని సూచించారు.

ఎస్.రాయవరంలో మోస్తరు వర్షం



కొరుప్రోలు వైఎస్సార్ కాలనీ రోడ్డుపై నీరు

ఎస్.రాయవరం: మండలంలో శనివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రంగా ఎడకాసి తర్వాత మధ్యాహ్నం కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో కొరుప్రోలు వైఎస్సార్, జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డులో నీరు చేరి తటాకాన్ని తలపించింది. ఈ నీటిలో మురుగు కలవడంతో కాలనీవాసులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. పి.ధర్మవరం, సైతారుపేట, తిమ్మాపురం తదితర గ్రామాల్లో వర్షపు నీరుతో ఇబ్బందులు పడ్డారు.